# శేషార్థం (నాటిక) - గంధం నాగరాజు

ఇటీవల విడుదలై సంచలనం సృష్టించిన ‘గమ్యం‘ సినిమా మాటల రచయిత శ్రీ గంధం నాగరాజు, ఒక్క సారిగా తెలుగు చలన చిత్ర పరిశ్రమ మొత్తాన్ని తన వైపు తిరిగి చూసేలా చేసారు. మామూలు పాత్రలూ, అతి సాధారణమైన సన్నివేశాలలో కూడ బలమైన సంభాషణలద్వారా మానవీయ విలువల్ని ఎత్తి చూపడం, పదే పదే ఆలోచింపచేసే వాక్యాలని తుపాకి తూటాల్లా సంధించడం ఈయన శైలి. సినీ రంగప్రవేశానికి ముందే అనేక అవార్డులు పొందిన నాటికల్ని వ్రాసారు. ఇటీవలే ఈయన వ్రాసిన ఈ నాటిక అనేక బహుమతులు పొందడమే కాక, అందరి మన్ననలనూ అందుకుంది. ‘కౌముది‘ పాఠకుల కోసం ప్రత్యేక ప్రచురణకి అనుమతినిచ్చిన శ్రీనాగరాజు గారికి కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం. రాబోయే రోజుల్లో కూడా నాగరాజు గారి రచనలని ‘కౌముది‘ కోసం ప్రత్యేకంగా అందిస్తాం.



సీన్ నెం: 1

ఫేడ్ ఇన్

వసుంధర, ఎమ్.ఆర్ ల ఇల్లు - వసుంధర చిన్నాని తయారు చేస్తుంటుంది. చిన్న అద్దంలో ముఖం చూసుకుంటూ ఉంటాడు - తను కూర్చున్న కుర్చీలో కుషన్ మార్చేందుకు వీలుగా తల్లికి నడుమును ఎత్తి సహకరిస్తాడు.

వసుంధర కుషన్ మార్చి - చిన్నా తల దువ్వటం మొదలు పెడుతుంది -

చిన్న: నాకే ఎందుకైందిలా?

(వసుంధర శ్రద్ధగా తలదువ్వుతూనే అడుగుతుంది)

వసు: ఎలా?

చిన్నా: ఇలా... నడవలేకుండా...

(ఒక్కసారి చిన్నా క్రాఫ్‌ని సరి చేసి తృప్తిగా చూసుకుని ముద్దాడుతుంది వసుంధర -)

వసు: నేనెప్పుడన్నా గాల్లో ఎగరటం చూసావా చిన్నా?..

(తల అడ్డంగా ఊపాడు చిన్న)

వసు:.. కదా!... మరి పక్షులు గాల్లో ఎగురుతాయి కదా... అలా నేను ఎగరలేకపోతున్నాననే ఫీలయ్యాననుకో అది కరెక్టా?...

**(ఆలోచనలో పడతాడు చిన్న)**

వసు: కాదు కదా...

చిన్నా: నువ్వు పక్షివి కాదమ్మ - నేను మనిషిని కదా...

**(పాట పాడుతుంది వసుంధర)**

వసు: బట్ యు ఆర్ స్పెషల్... పక్షులు ఎగురుతాయి, చేపలు ఈదుతాయి మనుషులు నడుస్తారు... నువ్వు వీళ్ళందరికన్నా స్పెషల్ అన్నమాట..

**(చిన్నగా నవ్వుతాడు చిన్న)**

చిన్న: మాయపుచ్చుతున్నావ్‌లే...

వసు: మాయపుచ్చటం కాదమ్మ...**(ఫోన్‌మోగుతుంది)** - య్యా... ఆ యస్.. డాక్టర్ వసుంధర స్పీకింగ్?... యస్.. రావుగారు .. ఓకె రాత్రి వేసారా టాబ్‌లెట్లు? అలా కాస్త డ్రౌజీగా.. మత్తుగా ఉంటారు... నథింగ్‌టు వర్రీ... అవునా?.. పక్కనే ఉందా.... దట్స్ గుడ్ తను ఎదురుగా నాకెప్పుడూ ఫోన్ చేయకండి... ఒక్క టూ మినిట్స్ ఆగి తన చేత నాకు రింగ్ చేయించండి.. ఓకె..

**(ఫోన్ పెట్టేసింది)**

చిన్న: ఎవరమ్మ?

**(బుక్ రాక్‌లో ఉన్న బుక్స్ సర్దుతుంది వసుంధర)**

వసు: నీరజక్క ఉంది కదా.. వాళ్ళడాడి..

చిన్న: నీరజక్క... ఆ ! అప్పుడు నేను హాస్పటల్‌కి వచ్చినప్పుడు నీదగ్గర ఏడ్చింది

**(అవునన్నట్టు తలూపించి వసుంధర) (ఫోన్ మోగింది)**

వసు: హాలో గుడ్‌మార్నింగ్ నీరు డార్లింగ్ హౌ ఆర్ యు?.... అవునా?.. చెడ్డఆలోచనలు... చెత్తవి..ఓకె.. రానీ.. ఎన్నైనా రానీ.. నాకూ ఒస్తాయి... అని ఒస్తున్నప్పుడు మనం రానిచ్చామనుకో.. ఆగిపోతాయ్... ఆపాలని ప్రయత్నిస్తే ఒస్తూనే ఉంటాయి..

వసు: రైట్... నే ఇచ్చిన టాబ్లెట్లు వేసుకో.. హాయిగా రెస్టుతీసుకో.. ష్యూర్ నేమాట్లాడతాను.డెఫనెట్‌గా మాట్లాడతాను.. సరేనా.. ఒకే.. బాయ్...

చిన్న: నీరు అక్కకి ఏమైందమ్మ?

వసు: ఊ... అక్క మనసుకి జ్వరమొచ్చింది...

చిన్న: నీ పేషెంట్లందరికీ మనసుకీ జ్వరమొస్తుంది ఎందుకమ్మ?

వసు: (నవ్వు) ఎందుకంటే నేను క్లినిక్ల్ సైకాలజిస్టుని కనుక...

చిన్న: మనసుకి జ్వరం రావడమంటే ఏంటమ్మ?

**(చిన్నాకి దగ్గరగా ఒచ్చి తలమీద చేయి వేసి నిమురుతుంది)**

వసు: అంటే.. తమని తాము మర్చిపోవడం...

**(అర్థం కానట్టు ముఖం పెడతాడు చిన్న)**

వసు: మనసుకి జ్వరం వచ్చిన మనిషి. తనని తను గుర్తుపట్టుకోలేడు - తనవాళ్ళని గుర్తుపట్టలేడు... యు గాట్ ఇట్...

**(తల ఊపుతాడు చిన్న)**

చిన్న: అలాంటివాళ్ళని నువ్వు బాగు చేస్తావా అమ్మా?

(తల ఊపుతుంది వసుంధర)

చిన్న: మరి డాడినెందుకు చెయ్యవలా?

ఫేడ్ అవుట్

సీన్ నెం:2

ఫేడ్ ఇన్

వసుంధర ఇల్లు -

సంపాతి సూట్ కేస్ పట్టుకుని సీరియస్‌గా మేడమీదకి వెళ్ళిపోతాడు - ఆ వెనుకనే మెళ్ళో సెల్‌ఫోన్‌తో పి.ఎ ఎంటరౌతాడు - ఫోన్ మాట్లాడుతుంటాడు -

పి. ఎ: పి. ఎ టు ఎమ్ ఆర్ స్పీకింగ్ - సారీ.. ఇవ్వాళ అప్పాయిమెంట్స్ అన్నీ రేపటికి పోస్ట్‌పోన్ అయ్యాయి - రేపటివా?.... అవి నిన్నటి రోజుకి ప్రీపోన్ అయ్యాయి - ఇంతకీ మీకెప్పుడుంది అపాయింట్‌మెంట్? - నిన్నటిరోజునా.. అయితే మీరు ఎల్లుండి కలవండి - ఏంటీ అర్థంకాలేదా?-

(ఎమ్మార్ ఎంట్రన్స్)

ఎమ్మార్: అర్థంకావ్... ది గ్రేట్ ఒన్ అండ్ ఓన్లీ బిజినెస్ టైకూన్ ఎమ్మార్.. చేసే పనులు ఎవ్వరికీ అర్థంకావ్.. (కొద్దిగా తూలి నిలదొక్కుకుంటాడు)

పి.ఎస్: అదే చెపుతున్నాను సార్....

ఎమ్మార్: గుడ్. చెప్పు.. అదే చెప్పేయ్.. వీలుంటే పేపర్లో కూడా వేయించేయ్...

(సంపాతి వస్తాడూ)

హేయ్.. సంపాతి బాస్టర్డ్.. నువ్వేంటి బెంజికారుని ఎద్దుల బండిలా తోల్తావ్... పోనీ ఎద్దుల బండి కొనమంటావా బెంజికారులా తోలుదుగాని..

సంపాతి: మీ ఇష్టం సార్..

ఎమ్మార్: యస్ .. నీ ఇష్టమే ... అంతా నా ఇష్టమే... ఈ ప్రపంచంలో ఏం జరిగినా అంతా నా ఇష్టప్రకారమే జరగాలి.. అంతా నా ఇష్టప్రకారం.. ఇంతకీ ఏది నా ఇష్టసఖి బ్యూటిఫుల్ ... డార్లింగ్... వసుంధరా డార్లింగ్... మైడియర్ బ్యూటిఫుల్ మిసెస్ ఎమ్మార్... వేరార్‌యూమామ్?

వసుంధర లోపలినుంచి ఒస్తుంది -

ఎమ్మార్: (చిన్ననవ్వు) వెల్‌కమ్.. పద్మశ్రీ మిసెస్ ఎమ్మార్...

(ఎమ్మార్ భుజం మీద కోటు అందుకని పి.ఎ కి ఇస్తుంది వసుంధర)

వసు: ఈ పద్మశ్రీ ఎక్కడినుంచి వచ్చింది...

ఎమ్మార్: వస్తోంది... జస్ట్ ఆన్ దివే.. యునో వన్ థింగ్.. రాత్రి ఎమ్ ఆర్ ఇచ్చిన పార్టీకి వన్ ట్వెంటీటు..సరిగ్గా నూట ఇరవై మంది

ఎమ్.పి లు ఫ్రమ్ ఆల్ పార్టీస్ అటెండ్ అయ్యారు.

**(సూట్ కేస్ ఏదని సంపాతికి సైగజేస్తుంది వసుంధర పైనపెట్టానంటంతో అతన్ని వెళ్ళిపొమ్మంటుంది - సంపాతి ఎక్సిట్)**

ఎందుకు? - ఫర్ ఓన్లీ ఒన్ గుడ్ రీజన్ - భారతదేశంలో ప్రఖ్యాతి వహించిన మానసిక వైద్యనిపుణురాలు మిసెస్ ఎమ్మార్ - అంటే నీకు ఈసారి పద్మశ్రీ అవార్డు ప్రకటించాలని - పై ఎత్తున లాబీ చేయడానికి..

**(ఎమ్మార్ దగ్గరనుంచి వాసన వస్తుంది వసుంధరకి)**

వసు: ఇంత ప్రొద్దున్నే బిగిన్ చేయాలా?

ఎమ్మార్: బిగినింగ్ కాదు రాత్రిదింకా క్లోజ్‌కాలా... పిఎ... క్లోజింగ్ పెగ్.. ఆకరిపట్టు కాకరకాయ్..

వసు: ఎందుకీలాబీయింగ్‌లు? నాకే పద్మశ్రీమీద ఇంట్రస్ట్‌లేదు...

ఎమ్మార్: నాకుంది.. దిగ్రేట్ ఎమ్మార్ వైఫ్ పద్మశ్రీ మిసెస్ ఎమ్మార్‌గా పిలవబడాలన్న ఇంట్రస్ట్ నాకుంది -

**(నవ్వుతుంది వసుంధర)**

ఎమ్మార్: ఎందుకు నవ్వుతున్నావ్?

వసుంధర: పద్మశ్రీ మిసెస్ ఎమ్మార్ - ఇందులో ఎక్కడా నా పేరు లేనందుకు ...

ఎమ్మార్: యు మీన్ వసుంధర.. అవసరమా?... పోనీ పెట్టుకో.. పద్మశ్రీ మిసెస్ వసుంధరా ఎమ్మార్....

వసు: వాటి మీద అంత ఇంట్రెస్టెడ్ అయితే మీరు మీకోసమే లాబీ చేసుకుని తెచ్చుకోవచ్చుగా పద్మశ్రీ ఎమ్మార్ అని -

ఎమ్మార్: పద్మశ్రీ. భారతరత్నకి తక్కువ యాక్సెప్టు చెయ్యం మనం -

పి.ఏ: భారత రత్న కాదు - తాగుడు రత్న కరెక్ట నీకు...

**(చివుక్కున పి.ఎ వైపు తిరుగుతాడు ఎమ్మార్)**

ఎమ్మార్: ఏదైనా అన్నావా?

**( పి.ఎ చేతిలోంచి గ్లాసు తీసుకుని ఓ సిప్ చేస్తాడు)**

ఎమ్మార్: భయం లేదు.. ఏమన్నావో చెప్పు...

**(పి.ఎ గుటకలు మింగుతాడు)**

ఎమ్మార్: చెప్పావనుకో నీ జీతం ఐదువేలు పెంచు. లేకపోతే ఉద్యోగంలోంచి తీసేస్తా...

పి.ఎ: మీకు భారతరత్న కాదు తాగుడు రత్న కరెక్ట్ అన్నాను సార్...

**(విరగబడి నవ్వుతాడు ఎమ్మార్...)**

ఎమ్మార్: ఇది చెప్పటానికెందుకు భయం - ? నిజమే కదా మనకు ఆ బిరుదే. ఏంటది..

పి.ఎ: తాగుడూ...

ఎమ్మార్: తాగుడురత్న... వండ్రఫుల్.. గుడ్‌జోక్...

**(అంతలో వసుంధర ఓ కవర్ తీసుకొచ్చి ఎమ్మార్‌కిస్తుంది)**

ఎమ్మార్: ఏంటది?

వసు: నా అప్లికేషన్?...

వసు: చెప్పాకదా.. అమెరికన్ సైక్రియాటిక్ అసొసియేషన్‌లో రీసెర్చి అసోసియేట్‌గా జాయిన్ అయ్యేందుకు అప్లైచేసాను కదా...

ఎమ్మార్: య్యా ... కంగ్రాట్స్ -

వసు: అయితే ఓ కేస్ స్టడీ ఇచ్చారు - దాన్ని పూర్తి చేసి సబ్‌మిట్ చేస్తే ఎడ్మిషన్ - ఫెలోషిప్ వస్తాయి..

ఎమ్మార్: చేసేయ్

వసు: చెప్పినంత తేలికకాదు.. క్లినికల్ సైకాలజీలో ఫ్యామిలీ థెరపీ గురించి స్టడీ చెయ్యాలి -

ఎమ్మార్: నా కర్థమయ్యే భాషలో చెప్పు..

(ఎమ్మార్ దగ్గర గ్లాసు తీసుకుని పక్కన పెడుతుంది వసుంధర)

వసు: ఒక మెంటల్లీ డిప్రెస్‌డ్ పేషెంట్‌ని తీసుకుని -

ఎమ్మార్: అంటే లూజ్‌గాడిని -

వసు: (నిట్టూర్చి) పేషెంట్ డొమెస్టిక్ బిహేవియర్ ఎలా ఉంటుందో - ఎసైలమ్‌కి బదులుగా... డొమెస్టిక్ ఎట్మాస్ఫియర్‌లో ఉంచి ట్రీట్ చేస్తే పేషెంట్ మెటబాలిక్ అండ్ బిహేవియరల్ ప్రోబ్లమ్స్ -

ఎమ్మార్: అర్థమయ్యే భాష..

వసు: రేపటినుండీ ఓ మెంటల్లో.. ఒక లూజుని మనింట్లో ఓ నెలరోజుల పాట పెట్టుకుని అబ్జర్వ్ చేసి ఓ కేస్ స్టడీ తయారు చెయ్యాలి...

ఎమ్మార్: ఒక లూజు... ఒన్ మంత్.. ఇక్కడే. మనతో పాటు.. కేస్ స్టడీ

- యూనివర్సిటీ ఆఫ్ సౌత్ కాలిఫోర్నియా.. రీసెర్చి .

ఎమ్మార్: మిసెస్ ఎమ్మార్ - పద్మశ్రీ- రీసెర్చి - లాబీయంగ్‌కి హెల్ప్‌అవుతుంది.. (ఒకే సిప్‌లో గ్లాసులోది తాగేస్తాడు) -

డన్ మైడియర్ డార్లింగ్ -

నీకు పద్మశ్రీ రావడం కోసం ఎమ్మార్ దేన్నైనా భరిస్తాడు -

ఇంతకీ ఇంటికొచ్చే లూజ్ ఎవరు? (పి.ఎ గ్లాస్ అందుకుంటాడు)

వసు: డాక్టర్ రెడ్డి మూడు కేసులు రిఫర్ చేసారు - అందులో ఓ కేసు బాగా నచ్చింది -

ఎమ్మార్: లూజుల్లో నచ్చే లూజులు కూడా ఉంటారా.?

వసు: ప్లీజ్.. మెంటల్లీ డిప్రెస్డ్ కూడా మనుషులే అలా రెడిక్యులేట్ చేయొద్దు...

ఎమ్మార్: చూడు వసుంధరా నేను చాలా ఫ్రాంక్‌గా మాట్లాడతాను... నువ్వు ట్రీట్ చేసే పేషెంట్లందరూ మనుష్యులని నువ్వనుకోవచ్చు నేననుకోను - వాళ్ళు మనుషులు కాదు .. పేషెంట్లు.. వాళ్ళేకాదు.. ఈ ప్రపంచంలో గుడ్డివాళ్ళూ, చెవిటివాళ్ళు ఎవ్వరూ నా దృష్టిలో మనుషులుకారు...

(చిన్నా ఎంట్రన్సు - ఎమ్మార్ - చిన్నాని చూడగానే ఆగిపోతాడు)

(చిన్నా కూడా ఎమ్మార్‌ని చూడగానే... నిలిచిపోతాడు)

ఎమ్మార్: వసుంధరా.. (చిన్నాని వెళ్ళిపొమ్మన్నట్టు సైగచేస్తాడు)

(వసుంధర పి.ఎ వైపు సైగ చేస్తుంది.. పి.ఎ చిన్నాని తీసుకెళ్ళిపోతాడు)

వసు: వాడు మీ కొడుకు...

ఎమ్మార్: (వెళ్ళబోతూ ఆగి) కాదు.. జోక్... హి ఈజ్ సింప్లీ ఎ జోక్.. అన్నీ ఇచ్చాడు (పైకి చూపిస్తాడు) వాడు... డబ్బు హోదా వంశం, కులం పలుకుబడి అధికారం ఆరోగ్యం అన్నీ.. బోనస్‌గా నీలాంటి భార్యనుకూడా ఇచ్చి - చివర్లో ఒక ప్రాక్టికల్ జోక్ వేశాడు దేముడు నా మీద - అది వాడు - ఈ శరీరం నుంచే పుట్టినా సరే ఒప్పుకోను - మనిషి కాదు జస్ట్ ఎ క్రీచర్.. యాన్ ఇన్‌కంప్లీట్ క్రీచర్ - అంతే !

వసు: మరి మీరు -

- అర్థోక్తిగా చూస్తాడు ఎమ్మార్ -

ఎమ్మార్: అంటే...

వసు: వైకల్యాలు శరీరానికే కాదు.. మనసుకీ ఉంటాడు - ఎప్పుడూ నిషాలో ఉండే మీరు నిజంగా సంపూర్ణమైన మనిషి అనుకుంటున్నారా ఎమ్మార్... ఇన్‌ఫాక్ట్ తాగటం కూడా - జబ్బే.. అదిమీరు గుర్తుపెట్టుకోలేని జబ్బు - అలా అని మిమ్మల్ని ఎవరూ నిరాకరించలేదు కదా! -

ఎమ్మార్: నిరాకరించలేరు... ఎమ్మార్ ది గ్రేట్? ఎవ్వరూ నిరాకరించలేరు వసుంధర...

తాగుడు జబ్బా? -

నడుం కింద వరకూ చచ్చుబడిపోయిన నీ కొడుకు నడవలేడు - ఎందుకు ! -పుట్టానా అని ఏడుస్తుంటాడు -

బట్ ... ఐయామ్ ఎంజాయింగ్ నాజబ్బు నాకు ఆనందాన్నిస్తుంది.. ఐ లైక్ డ్రింకింగ్ ..

వసు: అదొక్కటే కరెక్ట్ - తాగుడు తప్ప మీరు ఎవర్నీ ప్రేమించటం వేరు -

ఎమ్మార్: (వసుంధర దగ్గర కొచ్చి) నిన్ను కూడానా...

వసు: (దూరం జరిగి) ప్లీజ్...

డాక్టర్.: మై వె కమాన్ ప్లీజ్

- (డాక్టర్ రెడ్డి ఎంట్రెన్స్) రెడ్డిగారిని చూసి అటు వైపుకి తిరిగి సర్దుకుంటుంది వసుంధర -

రెడ్డి: ఈజ్ ఎవ్విరి థింగ్ ఆల్‌రైట్?... రాంగ్ ఎంట్రన్స్ ఇస్తున్నానా?

(వసుంధర వెళ్ళి రెడ్డిగారికి నమస్కారం పెడుతుంది) "గ్లాడ్ బ్లెస్ యు ఛైల్డ్ -

రెడ్డి: చిన్న తగాదాలాంటి దాంట్లో ఉన్నట్టున్నారు...

వసు: అదేం లేదు డాక్టర్...

ఎమ్మార్: యు ఆర్ రైట్ డాక్టర్ రెడ్డి - చిన్న తగాదా కాదు.. చాలా పాత తగాదాలో ఉన్నాం... ఎనివే నైస్ టు సీయు

(ఇద్దరూ షేక్ హేండ్ ఇచ్చుకుంటారు)

రెడ్డి: సంసారంలో తగాదాలు ఉన్నంతవరకూ మేరిటల్ లైఫ్ ఫ్రెష్ గా ఉన్నట్లు.. ఒక్క చిన్న తగదానూ లేదనుకో..కిక్ లేనట్టు..

ఎమ్మార్: నేను ప్రస్తుతం కిక్ లోనే ఉన్నాను..కాస్త ఫ్రెష్ ఐ వస్తాను..సో దట్ వియ్ కెన్ టాక్..

రెడ్డి: ప్లీజ్..కారీ ఆన్..

(వసుంధర పేపర్లు తీసుకొచ్చి రెడ్డి గారికిస్తుంది.)

రెడ్డి: వేరీ హేపీ అమ్మా.. ఈ రీసెర్చి నా లైఫ్ యాంబిషన్.. కుదరలేదు.. ఒకె.. నా దగ్గర చదువుకుని నన్ను మించిపోయిన నా స్టూడెంట్ వి నువ్వు దీన్ని సాధించడం హేపీ అమ్మా..!(కవర్ వసుంధర కిచ్చి) యువర్ కేస్ స్టడీ ఈజ్ వెయిటింగ్ ఔట్ సైడ్.

వసు: ఏదీ.. ఇంట్లో ఉండబోయే పేషెంట్ బయట వెయిట్ చేస్తూ..?

రెడ్డి: అవునమ్మా.. బయట గార్డెన్ లో ఉన్నాడు..

(వసుంధర కాస్త సంశయంగా ఉంటుంది)

రెడ్డి: ఏంటి.. ఒంటరిగా ఉన్నాడేమోననా.. నో ప్రోబ్లెమ్..నిముషంలో తోటలో ఇన్న మొక్కలతో స్నేహం చేసెయ్య గలడు.. డాక్టర్ కిరీటి.. యస్..హి ఈజ్ ఎ డబుల్ డాక్టరేట్..ఎ జీనియస్ ..అండ్ మోర్ దన్ దట్..ఏ గ్రేట్ హ్యూమన్ బీయింగ్..

నిజానికి అతను పేషెంట్ అని నేనే కొన్ని సార్లు మర్చిపోతుంటానమ్మా..

(ఫైల్ ఒకటి తీసి వసుంధర చేతికిస్తాడు)

ఇవాల్టి నుంచీ ఒక నెలరోజులపాటు నీదగ్గరే ఉండబోయే - ఒక మెంటల్లీ డి ప్రెస్డ్ పేషెంట్ తాలూకు కేస్ ఫైలమ్మా ఇది - డిసార్డర్ ఆఫ్ చైల్డ్ హుడ్ అండ్ ఎడాలసెన్స్ మేడ్ హిం టుబి ఎ స్కిజోఫినిక్ పేషెంట్-

బాల్యంలో, కౌమార్యంలో జరిగిన కొన్ని బలమైన సంఘటనల తాలూకు ప్రభావం ఇప్పటికీ అతన్ని వెంటాడుతోంది.

బట్ హి ఈజ్ ఎ వండర్ - అతని మెమరి గాని పర్సనాలిటీ కేర్ లో గానీ ఎలాంటి ఛేంజ్ లేదు.,,అయితే మెడికేషన్ వల్లా ఎమార్ఫస్ స్ట్రెస్ వల్లా బ్రెయిన్ లో బ్లడ్ క్లాట్స్ ఉన్నాయి.

అతను విపరీతంగా ఆవేశపడితే అతని ప్రాణానికే ప్రమాదం..అతను ఎక్సైట్ అయినప్పుడల్లా వెంటనే - సెడేషన్ ఇచ్చి అతన్ని కంట్రోల్ చెయ్యాలి..

**వసుంధర:** ఎనీ వైల్డ్ బిహేవియర్..అంటే ఎవరికన్నా హాని చేయడం..ఉన్నచోటినుంచీ పారిపోవడం..?

**రెడ్డి:** నో వే.చెప్పాను కదమ్మా.. అతను పేషెంట్ అని చెబితే గానీ తెల్సుకోలేము..

(ఎమ్మార్ ఎంట్రెన్స్)

**ఎమ్మార్:** ఏం..డాక్టర్ పేషెంట్ వేషంలో ఉంటాడా? (పి.ఎ. తో) గెట్ వన్ సిగార్ అండ్ పెగిట్..డాక్టర్ కేర్ ఫర్ స్నాచ్..

**రెడ్డి;** థాంక్స్..పగలు కష్టం..

**ఎమ్మార్:** నాకు అంతే..అందుకే రాత్రి మొదలు పెడతా..పగలు జస్ట్ రాత్రి దానికి కంటిన్యుయేషన్ అంతే..

**రెడ్డి:** ఎమ్మార్..వసుంధర కేస్ స్టడీ విషయంలో నీకో జెంటిల్మన్ ని పరిచయం చేయబోతున్నాను.

**ఎమ్మార్:** (పి.ఎ. పెగ్ ఇస్తాడు) జెంటిల్మన్..లూజ్ జెంటిల్మన్..?

**రెడ్డి:** మెంటల్లీ డిప్రెస్డ్ అంటే నీ కు చాలా తక్కువ అభిప్రాయం ఉన్నట్టుంది మిస్టర్ ఎమ్మార్..

**ఎమ్మార్:** డాక్టర్ రెడ్డీ.. నాకు వాళ్ళమీద ఏ అభిప్రాయం ఐనా ఎందుకుండాలి!? నా దృష్టిలో లూజ్ గాళ్ళంటే అన్నీ మర్చిపోయేవాళ్ళు..

(చిటికేసి పి.ఎ. ని పిలుస్తాడు. దగ్గరకొచ్చిన వాడ్ని సాచికొడతాడు)

**ఎమ్మార్:** నాకు జోకులు నచ్చవ్..నీ జీతం పదివేలు తగ్గించాను...

నేను ఏవీ మర్చిపోను డాక్టర్..నేను లూజు కాదు కదా మరి లూజులగురించి నాకెందుకు ఆలోచన?పద్మశ్రీ మిసెస్ ఎమ్మార్ అదొక్కటే నా ఆలోచన - ఎవర్నో తీసుకొచ్చారు గదా..రమ్మనండి..

**రెడ్డి:** ఓకె.. నేను అతడికి మీ ఫేమిలీ మొత్తాన్ని పరిచయం చెయ్యాలి చిన్నాతో సహా..

**ఎమ్మార్:** బ్రూనే సుల్తానా?..ఒక మెంటల్ గాడికి ఫేమిలీ మొత్తాన్ని..

**రెడ్డి:** ప్లీజ్..ఎమ్మార్..అతనొక సెన్సిటివ్ పేషెంట్..అతనిక్కడ కంఫర్ట్ గా ఫీలవ్వాలంటే మీరతన్ని చాలా మామూలుగా డీల్ చెయ్యాలి..అమ్మా వసుంధరా ట్రై టు కన్విన్స్ హిమ్..

**వసు:** మీరు అతన్ని ఎకామిడేట్ చెయ్యాలి..

**ఎమ్మార్:** పిచ్చాడ్ని పక్కలో పడుకోబెట్టుకోనా?

**వసు:** డాక్టర్ నేను డ్రాప్ అవుతున్నాను..తనని..

**ఎమ్మార్:** ఓకె..రైట్..డాక్టర్ కారీయాన్ .. (పి.ఎ. వైపు చూసి వీల్ ఛెయిర్ సైగ చేస్తాడు)

**వసు:** చిన్నాని తీసుకురా..

(డాక్టర్ ఒక వైపుకి - పి.ఎ. ఒక వైపుకి వెడతారు)

**ఎమ్మార్:** ఎకామిడేట్ చెయ్యమన్నావ్..చేస్తాను.. బట్ ఎంటర్‌టైన్ మెంట్ మాత్రం చెయ్యను. . సరిగ్గా ఒక నెల తర్వాత లూజ్ గాడు ఇక్కడ కనబడడానికి వీలు లేదు..

(అంతలో బయటనుంచి మాటలు వినిపిస్తాయి కిరీటి వి)

**కిరీటి:** డాక్టర్..ఇక్కడ తోటలో ఉన్నవాళ్ళు సరిగా లేరు డాక్టర్..పూలు కోసి దేముడికిస్తారట..దేముడు దానంగా ఇచ్చిన వాటిని దేముడికే లంచంగా ఇచ్చేవాళ్ళు వీళ్ళు..ఉత్త మనుషులు డాక్టర్..

(పి.ఎ. చిన్నాని తీసుకొస్తాడు - ఎమ్మార్ తన గ్లాసుతో సహా ఓ పక్కగా నిలబడతాడు)

డాక్టర్ వాయిస్ వినబడుతుంది.

**డాక్టర్:** యస్..కిరీటీ.. ఉత్త మనుషులు అంతే.. ఇదే డాక్టర్ వసుంధర రెసిడెన్స్..

(డాక్టర్ లోపలికొస్తాడు - వెనకనే కిరీటి)

ప్లీజ్..

**వసు:** డాక్టర్ కిరీటి..వెల్ కమ్ టు మై హౌస్..

(లోపలికొచ్చి ఆగిపోతాడు కిరీటి)

**కిరీటి:** మేడమ్..డాక్టర్ మీది హోమ్ అని చెప్పారే..మీరు హౌస్ అంటారు..?

**ఎమ్మార్:** తేడా ఏమిటో..లూజ్..

**కిరీటి:** తేడా ఉందండీ..(ఎమ్మార్ వైపు నడుస్తాడు) మీరు ఎమ్మార్ కదా..గ్రేట్ బిజినెస్ మాన్..బిజినెస్ ఇండియా 2001 ఆగస్ట్ ఇష్యూ లో మీ మీద వచ్చిన ఆర్టికల్ చదివానండీ.. నైస్ మీటింగ్ యూ. ఐ యామ్ కిరీటి..

(ఒక్క సారి కిరీటి వైపు చూసి సిప్ చేస్తాడు ఎమ్మార్)

ఒహో..చెయ్యి బాగా లేదా?

ఇప్పుడు ఎమ్మార్ మీరు..(ఎమ్మార్ ని గుంజి వసుంధర పక్కన నిలబెడతాడు) మీ పక్కన మేడమ్ గారు.. మధ్యన (చిన్నాని ఎత్తుకుని) పేరేంటి?

**చిన్న:** చిన్న..

**కిరీటి:** ఈ చిన్న (ఎమ్మార్ కి ఇవ్వబోతాడు) (ఎమ్మార్ రిజక్ట్ చేస్తాడు) ఎత్తుకోవడం రాదా? పిల్లల్ని ఎత్తుకోవడం ఒక ఆర్ట్ ఎమ్మార్..ఇలా ఒక ఫేమిలీ ఒకే కప్పు కింద ఉంటే దాన్ని హోమ్ అంటారు..- ఇల్లు

(చిన్నాని కుర్చీలో కూర్చో బెడతాడు)

కాకుండా ఏదో మాడాక్టర్ గారూ , నేనూ - మా చుట్టూ నీ లాంటి వాళ్ళు మరికొద్ది మందీ..చిరాగ్గా తిరిగే సిస్టర్స్, వంటవాడు, వాచ్ మేన్..వీళ్ళంతా ఒకే కప్పు కింద ఉంటే..దాన్ని హౌస్ అంటారు..కొంప..అఫ్‌కోర్స్ టాక్సీలవాళ్ళు, ఆటోల వాళ్ళు దాన్ని మెంటల్ హాస్పిటల్ అని కూడా అంటారనుకోండీ..

(ఎమ్మార్ తప్ప అంతా నవ్వుతారు)

నే చెప్పింది రైటే కదా డాక్టర్..

**డాక్టర్:** ఆబ్సల్యూట్లీ కిరీటీ.. ఇక్కడి నుంచీ ఒక నెల రోజులపాటు నువ్విక్కడ ఉండబోతున్నావ్.. బి కంఫర్టబుల్ అండ్ బి కో ఆపరేట్ విత్ డాక్టర్ వసుంధర..

(ఇంకో పెగ్గు కలుపుకుంటాడు ఎమ్మార్)

**ఎమ్మార్:** కాస్త అర్థమయ్యేటట్టు తెలుగులో చెప్పండి అతనికి...

(ఏదో అనబోతున్న డాక్టర్ ని వారిస్తాడు కిరీటి)

**కిరీటి:** అర్థమయ్యింది ఎమ్మార్..ఇక్కడ నే ఉన్నన్నాళ్ళూ మిమ్మల్ని ఇబ్బంది పెట్టొందంటున్నారు డాక్టర్..

**ఎమ్మార్:** ఓకె..నీకిలా అర్థమయ్యిందా?

**కిరీటి:** ఐ లవ్ దిస్ ప్లేస్ మేడమ్.. నాకు మీ ఇల్లు బాగా నచ్చింది...మీ చిన్నా నచ్చాడు.

(ఎమ్మార్ కి ఫోన్ వస్తుంది. పి.ఎ. చేతికి గ్లాసు ఇచ్చి ఫోన్ మాట్లాడుతూ లోపలికెడతాడు) మీ ఎమ్మార్..నచ్చారు ఐయాం వెరీ హేపీ టు బి హియర్..

**వసు:** మీరొచ్చి మమ్మల్ని కలిసి పది నిమిషాలైనా కాలేదు. అప్పుడే మీకంత నచ్చామా కిరీటీ..?

**కిరీటి:** ఈ ప్రపంచంలో నేనింతవరకూ చూడని ప్రదేశాల్ని, కలవని మనుషుల్నీ కూడా ఇష్టపడతాను మేడమ్.. ప్రపంచంలో సమస్యలన్నీ ఇష్టపడకపోవడం వల్లే వస్తాయి మేడమ్..ఉగ్రవాదాలూ, యుద్ధాలూ,మతోన్మాదాలూ.. హేట్రెడ్ ఈజ్ ది రూట్ ఆఫ్ ఎవ్వెరి క్రైసిస్..!

**చిన్న:** అమ్మా..నా రూమ్ కి తీసుకెళ్ళవా?

**కిరీటి:** నే తీసుకెళ్తాను? నీ రూమ్ నేను చూడాలి కదా..!

(చిన్నా తలూపుతాడు)

**కిరీటి:** అవును..చిన్నా నీ రూమ్ లో నువ్వొక్కడివే ఉంటావా?.. మరి రాత్రులు పడుకునే ప్పుడూ..

(చిన్నా, కిరీటి వెళ్ళిపోతారు)

**వసు:** హి లుక్స్ సో నార్మల్..

**రెడ్డి:** యస్..బట్..ఎక్సైట్ అయినప్పుడూ మాత్రం జాగ్రత్త..సెడేషన్స్ -

**వసు;** ష్యూర్ డాక్టర్. వియ్ విల్ టేక్ కేర్ ఆఫ్ హిమ్...

**రెడ్డి:** ఓకె.. మరి నేనింక బయలుదేరనా.

**వసు:** నేను డ్రాప్ చేస్తాను డాక్టర్..

(ఇద్దరూ వెళ్ళడం - ఎమ్మార్ రావటం జరుగుతుంది..)

**ఎమ్మార్:** (ఫోన్ లో) ఓకె.. ఆ డీల్ ఫైనల్ చేయండి.. ఫండ్స్ నేను మూవ్ చేస్తాను...ఇంక పద్మశ్రీ పేనెల్ లో ఎవరున్నారో చూసి మన సైడ్ నుంచీ ఫండ్స్ పంపు. బై ది వె.. అమెరికన్ సైకియాట్రిక్ అసోసియేషన్ ఫెలోషిప్ వచ్చింది వసుంధరకి. మన రిప్రజెంటేషన్ లో అది కూడా మెన్షన్ చెయ్..

(కిరీట్ ఎమ్మార్ పక్కనే నిలబడి చూస్తుంటాడు)

ఓకె..టచ్‌లో ఉండూ.. బై..

(పక్కనే ఉన్న కిరీటిని చూసి దడుసుకుంటాడు ఎమ్మార్)

**కిరీటి:** మై గాడ్. మీ ఇల్లు చాలా పెద్దది ఎమ్మార్.. అవుట్ హౌస్ కాక..

**ఎమ్మార్:** (చిన్నగా నవ్వి) మొత్తం 32 గదులు..

**కిరీటి:** తతిమ్మా 29 మంది ఏరి?

ఎమ్మార్: 29 మంది ఎవరు?

కిరీటి: మీరు, మేడమ్‌గారు, చిన్న - ముగ్గురు ..మూడు గదులు..ఇంకా 29 గదులు ఖాళీ కదా..

ఎమ్మార్: మెంటల్ హాస్పిటల్ అనుకున్నావా? గదికి ఒక్కడుండటానికి?

కిరీటి: నో..ఎమ్మార్.. మా హాస్పిటల్లో గదికి ఇద్దరుంటారు.. 9 గదులు..18 మంది మేము.

18 మందికి 9 గదులు సరిపోతాయని మెంటల్ హాస్పిటల్లో వాళ్ళకే తెలిసింది కదా..మరి ముగ్గురికి 32 గదులు ఎందుకు కట్టారు మీరు?

(పెగ్ మొత్తం ఒక్కసారి ఎత్తేస్తాడు ఎమ్మార్)

కిరీటి: మీరిందాక నేను లూజ్ అన్నారు కదా..అంటే నాకు కాస్త మెంటల్ అనే కదా..

మా లాంటి వాళ్ళు లూజ్ కాదు ఎమ్మార్..లూజర్స్

మమ్మల్ని మేము మానుంచీ పోగొట్టుకున్నాం..కావాలని కాదు ఎందుకో తెలీదు.. ఇదే (బుర్రని చూపించి) ఈ లక్షణం ..నార్మల్ పీపుల్ మర్చిపోవాల్సినవి మర్చిపోతారు. మనలాంటి వాళ్ళమే అనవసరమైనవి గుర్తుపెట్టుకుని కెలుక్కుంటాం..

(దూరంగా జరుగుతాడు ఎమ్మార్)

ఇంక ఇవాల్టికి చాలు ఎమ్మార్...(లేచి రెండడుగులు వేసి ఆగుతాడక్కడ) లాస్ట్ బట్ నాట్ లీస్ట్.. లూజర్స్ మాలాంటి వాళ్ళు..మరి లూజులు అంటే ఎవరో తెలుసా?(ఎమ్మార్ ని చూపిస్తాడు కిరీటి) మీలాంటి (తాగుబోత్లు సైగ) మీకిప్పుడు ఎలా వుందో మాకు తాగకపోయినా అలా ఉంది..డబ్బు ఖర్చుబెట్టి మరీ మీరు మాలా ఎందుకవుతారు?

డోన్ట్ రన్ ఫ్రమ్ యువర్ సెల్ఫ్ ఎమ్మార్! (చెయ్యి చాపుతాడు) మీరు చెయ్యి చాచలేరా..ఓకె..గుడ్ నైట్..

పిఏ.: పెగ్గెయ్యనా సార్..( పి.ఏ. చెంప పగులుతుంది.)

---ఫేడ్ ఔట్ ----

సీన్ నెం. 3

ఫేడిన్

: వసుంధర ఇల్లు: చిన్నాని రెడీ చేస్తుంటాడు కిరీటి:

చిన్న: నువ్వు మా ఇంటికొచ్చి పదిరోజులైందా డాక్టర్?

కిరీటి: అబ్బా..డాక్టర్ అని పిలవకు చిన్నా.. పధ్నాలుగు రోజులైంది.

చిన్న: నువ్వు డాక్టర్ వే నట గదా..అమ్మ చెప్పింది...రెండు సార్లట.. నువ్వు..నువ్వు.. పి.హెచ్..

కిరీటి: పి.హెచ్.డి

చిన్న: అంటే..?

కిరీటి: ఆల్‌రెడీ ప్రపంచంలో ఉన్నదాన్ని మళ్ళీ కనుక్కోవడం..

(చిన్నా అర్థం కానట్టు మొహం పెడతాడు)

కిరీటి: ఎవ్వరికీ పెద్ద ఉపయోగపడని విషయాల గురించి లావు పుస్తకాలు రాయడం..

చిన్న: కష్టమే కదా..

కిరీటి: మరి..?

(చిన్నా కుర్చీ కుషన్ మారుస్తుంటాడు కిరీటి)

చిన్న: డాక్టర్ నాకే ఎందుకైందిలా?

**కిరీటి:** పౌడర్ ఎక్కువైందా?

చిన్నా: కాదు..ఇది..(కాళ్ళు చూపిస్తాడు)

**కిరీటి:** (చిన్ననవ్వు) ఏమైంది?

చిన్న: అందరూ నడుస్తారు కదా!

**కిరీటి:** అందరిలా ఉంటే మన గొప్ప ఏముంది? ఎమ్మార్ నన్ను ఏమని పిలుస్తారు?

చిన్న: తప్పు..అలా పిలవకూడదు..

**కిరీటి:** సరే..ఏమని పిలుస్తారు..?

(చిన్నా సంశయిస్తూ చెబుతాడు)

లూజ్..

**కిరీటి:** ఎంతమంది లూజ్ లు ఉంటారు ఈ ప్రపంచంలో..మామూలు కన్నా తక్కువ..అదే స్పెషాలిటీ..
మనం ఎందుకిలా ఉన్నాం అంటే స్పెషల్ కనుక ఉన్నాం..
నడవలేనని గదా నీ బాధ? అసలిపుడు ఎవరు నడుస్తున్నారు..!? పొద్దున పూట షుగర్ పేషెంట్లు తప్ప.
మెట్లు ఎక్కి దిగడం లేదు. లిఫ్టులు ఒచ్చేసాయి. వీధి చివర పాల పేకెట్ కి కూడా బైక్ మీదే వెళుతున్నారు. ఇంకా రిక్షాలు, ఆటోలు, టాక్సీలు, బస్ లు, రైళ్ళు..విమానాలూ..మనుషులు నడవడం మానేసారు చిన్నా..
ఎందుకంటే..మనిషికి నడకకి మించిన వేగం కావాలి...స్పీడ్ .. ఆ స్పీడ్ కాళ్ళు అందుకోలేవు.. కాళ్ళతో పనిలేదు ఎవ్వరికీ..

చిన్న: మాయపుచ్చుతున్నావు కదా!?

**కిరీటి:** నేను కాదు చిన్నా. మనిషిని మనిషే మాయ పుచ్చుకుంటున్నాడు. అయినా ఏ గుళ్ళో దేవుడైనా నడుస్తాడా? నడిపిస్తాడు...
ఎప్పుడైనా సరదాగా షికారుకు రావాలనుకుంటే అలా అలా రథం మీద రౌండేస్తాడు.. ఇలా అన్నమాట..

చిన్న: అంటే నే దేముడినా?

**కిరీటి:** చిన్న పిల్లలందరూ దేముళ్ళే..స్కూళ్ళలో జేర్పించి వాళ్ళని మనుషుల్ని చేస్తారనుకో..

(సంపాతి ఎంట్రెన్స్)

**కిరీటి:** గుడ్ మార్నింగ్ సంపాతి డార్లింగ్..

**సంపాతి:** మార్నింగ్ సార్..

చిన్న: డాక్టర్.నన్ను రూమ్ లోకి తీసుకెళ్ళిపొండి..

**సంపా:** నో ప్రోబ్లెం చిన్నా సర్.. డాడీ ఈజ్ నాట్ కమింగ్..హి ఈజ్ వెరీ టెన్స్డ్ అప్.. ఆయన కారు ఆయనే డ్రైవింగ్..

**కిరీటి:** అయితే ఇవాళ నీకు లీవ్ దొరికినట్టేనా సంపాతి డార్లింగ్..

**సంపా:** లీవ్ అంటే సార్ మూడ్ ని బట్టి..అయినా కిరీటి గారూ..మీరు డార్లింగ్ అని పిలవకండి..మా మిసెస్ గుర్తొస్తుంది..

చిన్న: మీ మిసెస్ నిన్నలా పిలుస్తారా?

**సంపా:** నన్ను తప్ప అందర్నీ అలా పిలిచేది..

**కిరీటి:** అందుకేగా డార్లింగ్ అని నేను నిన్ను పిలుస్తున్నాను...అవునింతకీ ఎమ్మార్ ఎందుకు టెన్షన్ గా వున్నారు?

**సంపా:** తెలీదు సార్.. కానీ యమా సీరియస్ గా వున్నారు..ఏదైనా బిజినెస్ లాస్ ఒస్తే అలా సీరియస్ గా ఉంటారు..అమ్మో పిచ్చి

కోపమండీ బాబూ.. ఒక సారి గుర్రం పందేల్లో ఓడిపోయిందని..ఏస్ అని ఉండేది- ఆయన గారి సొంత గుర్రం - కాల్చి పారేసారు...

**కిరీటి:** పాపం..!

**సంపా:** అవున్సార్..బలే గుర్రం..

**కిరీటి:** పాపం..గుర్రానికి కాదు..ఎమ్మార్-కి..

గుర్రాలికి పందాలు తెలీవు కదా.. పరిగెత్తడమే తెలుసు.. మనిషికదా పందేలు కట్టేది.. ఎమ్మార్ ఓడి పోయిన గుర్రాన్ని కాల్చడమేమిటి..తనే కాల్చుకోవాల్సింది..

**(పి.ఎ. ఎంట్రెన్స్. అయగారు వస్తున్నారు అన్నట్టు సైగ.. సంపాతి ఎటెన్షన్ లోకి వస్తాడు. ఆ వెనుకనే ఎమ్మార్ ఎంట్రెన్స్, ఫోన్ లో మాట్లాడుతూ)**

**ఎమ్మార్:** నేను వినను.. యు ఆర్ ది డామ్ రెస్పాన్సిబిలిటీ..కోటి రూపాయలు పోయాయి..జస్ట్ నువ్వు చేసిన ఒక్కతప్పు వల్ల.

సుబ్బారెడ్డీ.. 99 రైట్లు చేసి ఒక్క తప్పు చేసినా 99 రైట్లు నాదగ్గర రైటాఫ్ ఐపోతాయి.. యు ఆర్ ఫైర్డ్..

**(ఫోన్ పెట్టి తలతిప్పగానే చిన్న కనిపిస్తాడు)**

సంపాతి..బాస్టర్డ్..రిమూవ్ హిమ్..

**(సంపాతి చిన్నాని తీసుకెళ్ళిపోతాడు..పి.ఎ. పెగ్ ఇస్తాడు)**

**కిరీటి:** ఎమ్మార్.. మీరు కోపంగా వున్నారా?

**(కిరీటి వైపు ఒక్క చూపు చూస్తాడు ఎమ్మార్)**

నవ్వాలన్నా ఏడవాలన్నా మనలోంచి రావాలి..కష్టం..కోపం చాలా ఈజీ.. అది ఎదుటి వాళ్ళమీద కదా ఒచ్చేది..

మీరు అరవై సెకన్లు కోపంగా వుంటే ఒక నిమిషం ఆనందం లైఫ్ లో పోయినట్లే తెలుసా..?

**ఎమ్మార్:** కోటి రూపాయలు పోయినయి..ఆనందంగా ఉండమంటావా?

ఒన్ క్రోర్..సున్నాలెన్నుంటాయో తెలుసా నీకు..?

**కిరీటి:** అయ్యో సున్నాలు పోయినందుకా కోపం మీకు..?

**ఎమ్మార్:** షిట్..మెంటల్..నా ఆస్తి ఎంతో తెలుసా నీకు? మై కంపెనీస్.. ఇండియాలో ఎబ్రాడ్లో..ఫాక్టరీస్..కంట్రాక్ట్స్, రియల్ ఎస్టేట్స్, షేర్స్.. వాటి విలువ ఎంతో తెలుసా నీకు? 350 కోట్లు..త్రీ హండ్రెడ్ అండ్ ఫిఫ్టీ క్రోర్స్..! ఎంతున్నాయ్.. నీజేబులో..ఈ క్షణం ఎంత డబ్బుంది నీ జేబులో..కమాన్ షో మి..

**కిరీటి:** నాకు జేబులు లేవు ఎమ్మార్.. 350 కోట్లు ఉంటే ఆనందంగా ఉండాలి కదా ఎమ్మార్.. కాని అందులోంచి ఒక్క కోటి పోయినందుకు మీరు బాధగా ఉన్నారు. 350 కోట్లు ఉండడం వల్లనే కదా కోటి పోయిందన్న బాధ.. మరా డబ్బు ఉండి ఏం లాభం ఎమ్మార్..? యువర్ కంపెనీస్, ఫేక్టరీస్, షేర్స్, రియల్ ఎస్టేట్స్ అన్నీ..అన్నీ..ఒక రోజు పోతాయ్..లేదా మీరే వాటిని విడిచి వెళ్ళిపోతారు. కానీ అనుభూతులు శాశ్వతం ఎమ్మార్. అవి మీకు ముందూ ఉన్నాయ్..మీతో ఉన్నాయ్. మీ తర్వాతా ఉంటాయ్..

**ఎమ్మార్:** ‘అనుభూతి‘ - అటువంటి పదార్థం ఎక్కడన్నా ఉంటే చూపించు.. ఇదిగో నే చేతిలో గ్లాస్ ఉంది..దాంట్లో మందు ఉంది..

అక్కడ సోఫా ఉంది..ఇక్కడ పుస్తకం ఉంది.. ఇవ్వన్నీ ఉన్నాయి..అనుభూతి - అదెక్కడన్నా ఉంటే చూపించు నాకు..!?

**కిరీటి:** తాగితే మీకొచ్చే కిక్ లో అనుభూతి ఉంది ఎమ్మార్. అది కనిపించదు..ఫీలవ్వాలంతే..

**(అంతలో పి.ఎ. ఫోన్ లో మాట్లాడి చెబుతాడు)**

పి.ఎ: సార్ బోర్డ్ మీటింగ్ కి టైమయ్యింది..

(చేతిలో గ్లాసు పూర్తి చేస్తాడు ఎమ్మార్) (వెడుతున్న ఎమ్మార్ కి ఎదురొస్తుంది వసుంధర)

వసు: షిప్పింగ్ కంపెనీలో..

(ఆగమన్నట్లు చెయి చూపించి వెళ్ళిపోతాడు ఎమ్మార్)

**కిరీటి:** ఎమ్మార్ చాలా ఫైర్ లో ఉన్నారు మేడమ్ ఇవ్వాళ

**వసు:** సమ్ బిజినెస్ ప్రోబ్లెమ్..ఒకె..హౌ ఆర్ యు కిరీటీ.. ఎలా ఉన్నారు ఇవ్వాళ?

**కిరీటి:** రోజుకో రకంగా ఉండడానికి నేనేమన్నా పొలిటీషియన్నా మేడమ్? నిన్నటిలానే ఉన్నాను..(నవ్వుతుంది వసుంధర)

**వసు :** మీరు కంఫర్ట్ గా ఉంటే మీకో కొశ్చనీర్ ఇస్తాను..దానికి జవాబులు రాయగలరా?

(ఫైల్ లో నుంచీ కొన్ని పేపర్స్ తీసిఇస్తుంది వసుంధర)

**కిరీటి:** రాయడమంటే బోర్ మేడమ్..అడగండి చెబుతాను..

**వసు:** ఓకె..దట్స్ ఫైన్..బి రెడి..

**కిరీటీ:** రెడీ..

**వసు:** మీకు ఒంటరి గా ఉండాలంటే భయంగా ఉంటుందా?

**కిరీటి:** ఎగరో ఫోబియా..ప్చ్..నాకు లేదు మేడమ్..

**వసు:** పదిమందిలో కలవాలంటే బెరుగ్గా..

**కిరీటి:** సోషల్ ఫోబియా.. అదికూడా లేదు మేడమ్..

**వసు:** ఏదన్నా ఎత్తునుంచి చూడలన్నా..

**కిరీటి:** హైటో ఫోబియా.. ప్చ్.. హైడ్రో ఫోబియా.. క్లిప్టో ఫోబియా.. నా కివన్నీ ఏమీ లేవు మేడమ్..

నే డిప్రెస్డ్ అనుకుంటారు మీరందరూ..నీ అయామ్ నాట్ డిప్రెస్డ్.

Depression is such a disorder characterized by lose of interest in utmost all usual activities..

రైట్..నేను కాదు కదా.. కానీ నాకందుకే వైద్యం చాసారు చాలా రోజులు - ఎందుకంటే ఆ వైద్యమే తెలుసు కనుక డాక్టర్లకి..!

ఇప్పుడు..మీరు ఈ ప్రశ్నల ద్వారా నా ఈగో ఎనాలసిస్ చేస్తున్నారు- అవునా? ఉపయోగం లేదు డాక్టర్..

ఈ ప్రశ్నలు ఈ జవాబులు ఈ ఎనాలసిస్ దిసీజ్ ఆల్ సింపిల్ అమెరికన్ బుల్ షిట్. ఏ ఇద్దరు మనుషులు ఒకే సందర్భానికి ఒకే రకంగా ప్రతిస్పందించరు డాక్టర్-

ఇప్పుడు నేను మిమ్మల్ని లాగి చెంపదెబ్బ కొడితే మీరెలా రియాక్టవుతారు - అదే ఎమ్మార్ కొడితే..చిన్నప్పుడు మీ అమ్మగారు కొట్టినపుడు..ఒకే రకమైన సంఘటనలో కూడా సందర్భాన్ని, అవతల మనుషుల్ని, మన పొజిషన్ ని బట్టి రియాక్షన్ మారి పోతుంటే..ఈ జనరల్ కొశ్చనీర్స్ తో చేసే అనాలసిస్..

ఓకె.. వీటి ప్రకారమే..నాకే స్కీజో ఫ్రేనిక్ డిజార్డర్ ఉంది అని తెలిసాక మీరేం చేస్తారు? మందులు సెడేషన్స్..నిద్రపుచ్చడం..కంటిన్యువస్ గా నిద్ర పుచ్చడం..

మీ ప్రిస్క్రిప్షన్ పాడ్ మీద ఎందుకు రాయరు మేడమ్..కూలిపోతున్న మానవ సంబధాలవల్లే మానసిక సమస్యలు ఎక్కువ అవుతున్నాయని.

ఎందుకు రాయరు మేడమ్ సూసైడ్ టెండెన్సీ ఉన్న టీనేజర్ తో వాళ్ళ పేరెంట్స్ ని రోజుకి రెండు గంటలైనా గడపమని..

ఎందుకు రాయరు మేడమ్ ఫామిలీ మెంబర్స్ అంతా రోజుకి ఒక్కసారైనా కలిసి భోజనం చేయమని..

నిద్రలో పక్క తడిపే చిన్నారిని అమ్మా, నాన్నా మధ్యనే పడుకోబెట్టుకోవాలని మీరెందుకు రాయరు మేడమ్?

ముసలి తలిదండ్రుల్ని ఒంటరిగా ఒదిలెయ్య వద్దని..బామ్మలూ, అమ్మమ్మలే మీకన్నా మంచి సైక్రియాటిస్ట్ లనీ..ఎందుకు.ఎందుకు రాయరు మేడమ్ మీ ప్రిస్కిప్షన్ పాడ్ మీద..?

వసు: కిరీటీ..ప్లీజ్..మీరు మాత్ర వేసుకోవాలి.. ప్లీజ్ డోంట్ గెట్ ఎక్సైటెడ్.ప్లీజ్..

కిరీటి: స్వప్నా..స్వప్నా,..ఎందుకు వెళ్ళిపోయావ్..ఉంటావనుకున్నాను. అమ్మలాగానే నువ్వు కూడా..నన్నొదిలేసి ఎందుకు..

వసు: కిరీటీ.. ప్లీజ్.. ఈటాబ్లెట్ వేసుకోండి..

(వసుంధర చేతిని పట్టుకుంటాడు కిరీటి)

కిరీటి: స్వప్న.. ఎందుకు వెళ్ళిపోయావ్..నా స్వప్నవే కదా నువ్వు..?

వసు: ఒకె.. నీ స్వప్ననే..ముందీ టాబ్లెట్..

(టాబ్లెట్ మింగుతాడు కిరీటి)

కిరీటి: స్వప్నా ..ప్లీజ్..వెళ్ళకు..

వసు: వెళ్ళను..ముందు నువ్వు పడుకో..ప్లీజ్..రిలాక్స్..

కిరీటి: నే రిలాక్స్ అయితే నువ్వెళ్ళిపోతావ్.. అందుకే నిద్రపోను..

వసు: నే వెళ్ళను.. వెళ్ళనన్నానుగా ప్రామిస్.. (సోఫా మీద కూర్చుంటుంది)

(పి.ఎ.ఎంట్రెన్స్..ఆ వెనక ఎమ్మార్)

(లేవ బోతుంది వసుంధర)

కిరీటి: నువ్వెళ్ళకు స్వప్నా.. (కూర్చుంటుంది వసుంధర)

(చూస్తున్న పి.ఎ. ని వెళ్ళమన్నట్లు సైగ చేసి - అక్కడి నుంచి మౌనంగా వెళ్ళిపోతాడు ఎమ్మార్.)

- ఫేడ్ ఔట్-

ఫేడ్ ఇన్

సీన్ నె. 4

-ఎమ్మార్ కూర్చుని ఉంటాడు. పి.ఎ.డిక్టేషన్ రాసుకుంటూ ఉంటాడు.

ఎమ్మార్: The board of directors finally passed a resolution not to accept your deal..

ఫాక్స్ లో పంపెయ్.

పి.ఎ: సర్.. (వసుంధర లోపలికి వస్తుంది)

ఎమ్మార్: నేను పిలిచే వరకూ రాకు..(పి.ఎ. వెళ్ళిపోతాడు)

వసు: ఇవ్వాళ చాలా ఫ్రెష్ గా కనిపిస్తున్నారు...

ఎమ్మార్: నో డ్రింక్స్..తాగలేదు.

వసు: మైగాడ్..ఎందుకో..!?

ఎమ్మార్: తాగినా పని చేయడం లేదు..

వసు: ఏమైంది? ఆ షిప్పింగ్ కంపెనీ గురించేనా? ఫర్ గెట్ ఇట్.. మర్చిపోండి...

ఎమ్మార్: షిప్పింగ్ అయితే మరిచిపోయే వాడ్ని. ఇది ఫ్రెండ్ షిప్పింగ్ గురించి కదా!?

వసు: ఏంటి?

ఎమ్మార్: వసుంధరా..నాకు ఫ్రాంక్ గా మాట్లాడ్డం అలవాటు. నాకు అనేకమంది డవాళ్ళతో సంబధాలున్నాయి..ఇన్ ఫాక్ట్ నీ బెస్ట్ ఫ్రెండ్ సుష్మాతో కూడా.. నా దృష్టిలో అది తప్పు కాదు..ఒకే కూరతో రోజూ ఎవడూ తినలేడు.

బట్ నీకు ఆ గొడవలేదు..ఇప్పటివరకూ..అన్పించవచ్చు..రాత్రి పగలూ తాగే మొగుడు.. నలభైల్లోకి పడబోతున్న వయసు.. ఇప్పుడు కాకపోతే..ఇంకెప్పుడు?

బట్..నువ్వు ఆషామాషీ మనిషివి కాదు..యు ఆర్ మిసెస్ ఎమ్మార్..

డిసెన్సీ..డేకోరమ్ ఉండాలి..

పోయి పోయి ఓ పిచ్చాడితో ఎఫైర్ అంటే..అయితే పిచ్చివాళ్ళకి బలమెక్కువ అంటారనుకో..

షుగర్, బి.పి...షూర్ ఐ యామ్ నాట్ దట్ స్ట్రాంగ్..

నేను నీకు అడ్డంగా రాను.. కానీ ఆ మెంటల్ గాడితో కాదు.. ఇవాళరాత్రికి మల్హోత్రా వాళ్ళింట్లో పార్టీ ఉంది- రాంప్ షో..మేల్ మోడల్స్ - పిచ్చివాళ్ళు కాదు..కానీ బలంగా ఉంటారు.. నీఇష్టం వచ్చిన వాళ్ళని ఛూజ్ చేసుకో..

మిసెస్ ఎమ్మార్ అంటే..ఎవ్వడూ కాదనడు..అంతే కానీ.. ఈ..

(వినలేనట్టు చేయి పైకెత్తుతుంది వసుంధర)

వసు: స్టాపిట్ ఐసే..

నిన్నో పేషెంట్ అనుకున్నాను..పెళ్ళైన ప్రతిక్షణం నుంచీ నిన్ను పేషెంట్‌గానే చూసాను. డాక్టర్ గా నిన్ను బాగు చేసుకోలేకపోయినా.. భార్యగా, నువ్వు ఏనాటికైనా మారతావన్న నమ్మకంతో..చాలా మంది భార్యల్లాగే వెయిట్ చేసాను..

చిన్నాని నువ్వు ట్రీట్ చేసే విధానం నచ్చకపోయినా..ప్రతిక్షణం వాసన్‌కొడుతున్న నీ ఉనికి వెగటు కలిగిస్తున్నా - నీ ధన దర్పం, అహంకారం, మెంటల్ తన జీవితం మీద విరక్తి కలిగిస్తున్నా ఓపికగా భరించాను. - రెండే కారణాలు.ఒకటి చిన్నా..వాడికి దేవుడు చేసిన అన్యాయంతో పాటుగా మనం విడిపోవడమనే ప్రమాదం చేదలుచుకోలేదు..

రెండు - నమ్మకం

దగుల్బాజీ వెధవలాంటి మొగుడు వెధవ ఒక నాటికి మారతాడని నమ్మే కోట్లాడి వెర్రి భార్యలకుండే ఏనాటికీ తీరని పిచ్చి నమ్మకం

ఇప్పుడా రెండూ లేవు ఎమ్మార్..

యు ఆర్ ఏన్ ఇంటెక్షనల్ పేషెంట్..నువ్వు కావాలని జబ్బుపడే మనిషివి. నిన్నెవరూ మార్చలేరు..కానీ..

ఇన్నాళ్ళుగా నాకు జవాబు దొరకని ఓ ప్రశ్నకు ఈ క్షణం జవాబు దొరికింది ఎమ్మార్.

ఎప్పుడూ అనుకునేదాన్ని ..నేనేం పాపం చేసానని అంత అవకరంగా బాబు పుట్టాడని...ఇప్పుడర్థమైంది - నీ ఛండాలమైన బుర్రలో ఉన్న అసహ్యకరమైన ఆలోచనల్ని నాలోకి నువ్వు స్ఖలిస్తే వాడలా పుట్టాడు..

నీలాంటి మృగం..మృగాల మీద నాకు గౌరవం ఉంది...

నీతో ఇంతకాలం కాపురం చేసినందుకే కంపరంగా ఉంది...

కిరీటి మీద నీకు అనుమానం కదూ..ఓకె.. నీ అనుమానాన్ని నిజం చేస్తాను.. నా జీవితంలో ఒక్క క్షణం కూడా నీతో కలిసుండను..

ఎమ్మార్: వసుంధరా..యు మిస్ అండర్ స్టుడ్ మి..

వసు: దగ్గరికి రాకు - నేను కిరీటిని పెళ్ళిచేసుకుంటాను.. నీ నుంచీ శాశ్వతంగా విడిపోతాను. ఒక్క అరగంటటైమివ్వు ఇంట్లోంచి

బయటికెడతానికి..

(ఎమ్మార్ మాట పట్టించుకోకుండా వెళ్ళిపోతుంది వసుంధర)

**(వసుంధర విసవిసా వెళ్ళిపోవడం..చిన్నా వీల్‌ఛైర్ తో సహా కిరీటి లోపలికి రావడం జరుగుతుంది.)**

**కిరీటి:** మేడమ్ వెళ్ళిపోతున్నారు..

**(ఎమ్మార్ కిరీటి వైపు తిరుగుతాడు)**

**కిరీటి:** ఎమ్మార్..మీరు నెర్వస్ గా వున్నారా? ఆవిడెందుకు వెడుతున్నారు?

**ఎమ్మార్:** అరేయ్ నీకు దణ్ణం పెడతా నువ్వెళ్ళిపోరా..

**కిరీటి:** అదేంటి ఎమ్మార్.. ఇంకా నేను 15 రోజులు ఇక్కడే ఉండాలి..

**ఎమ్మార్:** ఇంకా నువ్వు 15 రోజులుంటే నే బికారినైపోతా్నా..దయచేసి వెళ్ళిపో..

**కిరీటి:** నే వెళ్ళిపోతే వసుంధరా మేడమ్..

**ఎమ్మార్:** వసుంధరే నన్ను విడిచిపోయేట్టుంది.. నువ్విక్కడుంటే వసుంధర నాకు దక్కదు. మెంటల్ గాడివైనా రెండుచేతులెత్తి దణ్ణం పెడుతున్నా..పోరా..

**కిరీటి:** వాటీజ్ దిస్ ఎమ్మార్..యు ఆర్ గ్రేట్..వసుంధర పోతే పోనివ్వండి. మీక్కావల్సింది వసుంధర కాదుకదా..
మీరు కన్ఫ్యూజ్ అవుతున్నారు ఎమ్మార్..మీక్కావల్సింది పద్మశ్రీ మిసెస్ ఎమ్మార్.వసుంధర కాదు..అసలి ఈవిడకి పద్మశ్రీ ఇప్పించే ప్రయాస మీకెందుకు...ఆల్‌రెడీ పద్మశ్రీ ఉన్నావిడని చూసి పెళ్ళిచేసుకోండి..

**ఎమ్మార్:** నాకు వసుంధర కావాలి..

**కిరీటి:** ఎందుకు? మీ కంపెనీస్, షేర్స్, ఫాక్టరీస్, రియల్ ఎస్టేట్స్..ఇవన్నీ మీతోనే ఉంటాయి ఆవిడ లేకపోయినా..
ఎమ్మార్ అధికారం, పరపతి, స్టేటస్ అన్నీ అలానే ఉంటాయి ఆవిడ లేకపోయినా.మీ కార్లు, బంగళా, నౌకర్లు, మందూ అన్నీ ఉంటాయి ఆవిడ లేకపోయినా..మరింకెందుకు వసుంధర.?

**ఎమ్మార్:** తెలియదు..

**కిరీటి:** నాకు తెలుసు - ఉన్నదాని విలువ లేనప్పుడే తెలుస్తుంది ఎమ్మార్..అందుక్కావాలి మీకు వసుంధర..

**ఎమ్మార్:** కాదు.. నాకు వసుంధర అంటే ప్రేమ..

**కిరీటి:** ప్రేమ..చూపించండి నాకు..ఎలా ఉంటుంది? అక్కడ సోఫా ఉంది. ఇక్కడ బల్ల ఉంది. ఈ పుస్తకముంది..కానీ ప్రేమ ఇక్కడ ఎక్కడ ఉంది? చూపించండి ఎమ్మార్..కమాన్ షో ఇట్ టు మి..

ఎమ్మార్: నాకు తెలీదు..ప్రేమని చూపించడం నాకు తెలీదు. కానీ నాకు వసుంధర కావాలి...

**(రెండు చేతులతో ముఖం దాచుకుని బరస్ట్ అవుతాడు..చిన్నా వీల్ ఛైర్ మీంచి కిందకు పాకి ఎమ్మార్ వైపు వస్తాడు)**

చిన్నా: నాన్నా..నాన్నా..ఏడవొద్దు నాన్నా..

(ఒక్కసారిగా చిన్నాని కౌగలించుకుంటాడు ఎమ్మార్)

**కిరీటి:** ఇది ఎమ్మార్ నీక్కావలసింది ప్రేమ..ఇది ఇంతకాలం నువ్వు మిస్ ఐన అనుభూతి.. నీ ఆస్తి పాస్తులు కోట్లు, కార్లు, షేర్లు..అన్నీ దృశ్యేన నశ్యతే..
కనిపించిన వన్నీ నాశనమౌతాయ్..
కానీ ప్రేమ, అనుభూతి.అవ్వవ్.. మిగిలిపోతాయ్..శాశ్వతంగా..

(ఎమ్మార్ కొడుకుని ఎత్తుకుని కిరీటికి చేయి ఇస్తాడు)

**కిరీటి:** ఇప్పుడు నీ చెయ్యి శుభ్రంగా ఉంది ఎమ్మార్..

(ఎమ్మార్ లోపలికి వెళ్ళిపోతాడు)

**కిరీటి:** స్వప్న..శాశ్వతమైన దాన్ని ఒదులుకుని ఎందుకు వెళ్ళిపోయావ్..? నేను..నేను..ఇలా.. ఇలా..ఎందుకయిపోయాను స్వప్నా..

(వసుంధర ఎంట్రెన్స్)

**వసు:** మైగాడ్..కిరీటీ..కిరీటీ.. మందులు వేసుకోలేదా?

**కిరీటి:** స్వప్నా..ఎందుకెళ్ళిపోయావ్..

**వసు:** కిరీటీ..ఇదిగో నేనే.. నీ స్వప్న..ని

(వసుంధరని చూడగానే షాక్ కొట్టినట్లు దూరంగా జరుగుతాడు కిరీటి)

**కిరీటి:** స్వప్నవి కావు..నువ్వు అమ్మవి..అమ్మలు స్వప్నలు కారు..కాకూడదు..అలా చిన్నప్పుడు మా అమ్మ ఎవరికో స్వప్నమై వెళ్ళిపోయింది...నేనిలా మిగిలిపోయాను..

**వసు:** ముందీ టాబ్లెట్ వేసు...వద్దా..?

(విసిరి కొడతాడు)

**కిరీటి:** ఎమ్మార్..ఎమ్మార్..(వస్తాడు) చిన్నా..చిన్నా..మేడమ్..

(ఎమ్మార్ వస్తాడు..తూలిపడబోయిన కిరీటిని వసుంధర పట్టుకుంటుంది.)

(ఎమ్మార్ చిన్నాతో సహా వచ్చి వసుంధరకి సరాగా నిలబడతాడు)

కుటుంబం..ఫేమిలీ..పీస్.. ఇదే. ఇదే. మనిషికి కావలసింది..

మనిషి రోదసి వరకూ వెళ్ళినా తిరిగి ఇంటికి చేరాలనుకునేది ఈ కుటుంబం కోసమే..

భార్యా భర్తలు విడిపోవచ్చు.వాళ్ళిష్టం..కానీ..తల్లిదండ్రులు విడిపోకూడదు..

విడిపోతే పిల్లలు..నాలాగా హాఫ్ బేక్డ్‌గా..సమాజానికీ..ప్రపంచానికీ చివరికి మాకు మేమే ఉపయోగపడకుండా..ఇలా..

తలి దండ్రులూ విడిపోవద్దు..

(కిరీటి మరణిస్తాడు)

**- సమాప్తం -**